క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెన్నెలగడ్డ, భజరంగ్ హిల్స్, బౌద్ధ నగర్, దుర్గా విహార్, వసంత విహార్, అరేమ్స్ బర్గ్ కౌండిన్య అపార్ట్‌మెంట్స్, గణేష్‌నగర్, మహానగర్ ఎన్‌క్లేవ్, రుక్మిణి ఎన్‌క్లేవ్, జయరామ్‌నగర్, జెకే నగర్, కృష్ణనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిజాంపేట్ పరిధిలో..

విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కేటీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొలన్ నారాయణరెడ్డి కాలనీ, కేఎస్ఆర్ పార్కు, శ్రీనివాస కాలనీ, వెంకటసాయి హోమ్స్, జేఎస్ఎస్‌యూఆర్ఎం ఫేజ్–3లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కోవిడ్ నిబంధనలు పాటించండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 23 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్క్ ధరించాలని, తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలని వైద్యులు సూచించారు.

23న బాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్: గాజులరామారం మహదేవపురంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. 23న ఉదయం విఘ్నేశ్వర పూజ, ఋత్వికరణం, రక్షాబంధనం, మండపారాధన, లక్ష్మీ గణపతిహవనము, నవగ్రహవనము, బాబా మూల మంత్రహవనము, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న సంతర్పణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

నేడు ధర్నాచౌక్‌లో 'నిరుద్యోగ గోస- అఖిలపక్ష భరోసా' దీక్ష

కుత్బుల్లాపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 18న ఇందిరపార్కు ధర్నాచౌక్‌లో ×నిరుద్యోగ గోస- అఖిలపక్ష భరోసా₹ నిరసన దీక్ష చేపట్టనున్నట్లు టీజేఎస్ నాయకులు అశోక్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలని, చైర్మన్, బోర్డు సభ్యులను బర్తరఫ్ చేయడంతో పాటు కొత్త బోర్డును ఏర్పాటు చేసి మళ్లీ పరీక్షలకు నిర్వహించాలని, పరీక్ష రాసిన ప్రతి అభ్యర్థికి నష్టపరిహారంగా రూ.లక్ష ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో దీక్ష చేపడుతున్నారు. ఈ నిరసన దీక్షకు నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వీధికుక్కల పట్టివేత



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వీధికుక్కల బెడద తీవ్రతరం కావడంతో వాటి నియంత్రణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. వీధి కుక్కల బారిన పడి పలువురు గాయపడిన నేపథ్యంలో వాటిని తరలించాలని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో సోమవారం మున్సిపల్ వెటర్నరీ సిబ్బంది బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలను పట్టుకున్నారు. వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి సుదూర ప్రాంతాల్లో వదిలి పెడతామని అధికారులు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం



రాహూల్ (ఫైల్)

జీడిమెట్ల: టిఫిన్ తెచ్చుకునేందుకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్ చంద్రానగర్‌కు చెందిన బాబురావు కుమారుడు రాహుల్(21) ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 15న టిఫిన్ తెచ్చుకునేందుకు బయటికి వెళ్లిన రాహూల్ ఇంటికి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడి తల్లిదండ్రులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాహూల్ తండ్రి బాబురావు సోమవారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు తెలంగాణ సాధనే ధ్యేయం

మంత్రి మల్లారెడ్డి

- కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కొంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్, మైనంపల్లి హన్మంతరావు తదితరులు

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు తెలంగాణ సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతోందని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి చౌరస్తా వరకు రూ.25 కోట్లతో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులకు సోమవారం ఆయన ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్ మైనంపల్లి హనుమంతరావు, స్థానిక మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం దూలపల్లిలో అపర్ణ ఫామ్ గ్రూప్స్ సెప్టిక్ ట్యాంక్ నుండిచిదూలపల్లి కల్వర్టు, అశోక-ఏ- మైసన్ వరకు రూ.2.88 కోట్లతో చేపట్టిన ఆర్‌సీసీ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో జనాభా పెరుగుదలను దష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించే దిశగా ముందుచూపుతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. హెచ్ఎండీఏ ప్రతిపాదించినరూ. 25 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎస్‌డీపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో వరద నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం కోసం సుమారు రూ.4 కోట్లతో దూలపల్లిలో కల్వర్టు పనులను ప్రారంభిస్తామన్నారు. అపర్ణ ఫామ్ గ్రూప్స్ లో దాదాపు 10 కాలనీలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, శాశ్వత పరిష్కారంగా కల్వర్టు, నాలా నిర్మాణ పనులను ప్రారంభించచినట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్ , స్థానిక కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

'ప్రగతి యాత్ర'లో భాగంగా 46వ రోజు ఎమ్మెల్యే వివేకానంద్ కుత్బుల్లాపూర్ డివిజన్ బాపునగర్, వీకర్ సెక్షన్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ సోమేశ్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు



ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ పాఠశాలలో సోమవారం యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన టీవీఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ కోటిరెడ్డి, సామాజిక సేవకురాలు మంజులా రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం యూకేజీ విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లను, ప్రతిభను కనబరిచిన చిన్నారులకు పతకాలను అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



మేయర్ నీలారెడ్డిని ఇఫ్తార్ విందుకు ఆహ్వానిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

నిజాంపేట్: రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2కు చెందిన మైనార్టీ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 18న జరిగే ఇఫ్తార్ విందుకు రావాల్సిందిగా కోరుతూ మసీద్ కమిటీ సభ్యులు ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎండీ మున్నా, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్, ట్రెజరర్ బుర్హాన్, సెక్రటరీ ఎండీ ఇస్మాయిల్, జనరల్ సెక్రటరీ మెహబూబ్, ఫైజుద్దిన్, ఆర్గనైజర్ ఇస్మాయిల్, చోటు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం కేబీకే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ముష్కిపేట్ బస్తీలో 9వ రోజు మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, స్థానిక బీజేపీ నాయకుల పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన రాజేశ్వర్‌రావు సదుపాయాలు, వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను మహిళా మోర్చా అధ్యక్షురాలు, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకరరావు, వినోద్, డాకయ్య, నరేందర్‌రెడ్డి, వినోద్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాము, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. భరత్‌నగర్ కాలనీకి చెందిన బోయిన రాజయ్య బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. అతడికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించడంతో బీఆర్‌యస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరావును కలిసి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. సోమవారం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును పార్టీ కార్యాలయంలో సోమవారం రాజయ్య కుమారుడికి అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య కుమారుడు రాజశేఖర్ ముఖ్యమంత్రి కేసీఆర్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు ప్రాణసంకటం



రంగారెడ్డినగర్ చౌరస్తాలో విరిగిపోయిన స్తంభం

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది.. ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే ప్రధాన రోడ్డులో రంగారెడ్డినగర్ చౌరస్తాలోని స్వామి వివేకానంద విగ్రహం ఎదురుగా ఉన్న విద్యుత్ పోల్ విరిగిపోవడంతో అధికారులు తొలగించారు. కానీ ఒక అడుగు ఎత్తులో మిగిలిన రాడ్డు అలాగే ఉండటంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో, ట్రాఫిక్ ఎక్కువగా సమయాల్లో దీనిని గమనించకుండా వచ్చే వాహనదారులు ఢీకొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని ప్రమాదకరంగా ఉన్న స్తంభం ముక్కను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్‌లో ఇంజినీరింగ్, ఎలక్ట్రిసిటీ, ట్రాఫిక్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులతో కలిసి కల్వర్టు అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.1.07 కోట్ల నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 20 నుంచి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లోని కరెంటు కేబుల్స్, పోల్స్, వాటర్ లైన్ మార్చేందుకు చర్యలు తీసుకోవాలని, పనులు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కల్వర్టు ఎత్తు తక్కువ ఉండడంతో వర్షాకాలంలో వరదనీటితో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కల్వర్టు విస్తరణ పూర్తయితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట ఎస్ఈ చెన్నారెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ కృష్ణ చైతన్య, వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి, డీఈఈ పాపమ్మ, డీజీఎం రాజేష్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, టిఎస్ పిడిసిఎల్ డిఈఈ శ్రీనాథ్ రెడ్డి, ఏఈ మల్లారెడ్డి, మేనేజర్ అనూష, మాజీ కార్పొరేటర్ గౌరీష్ తదితరులు ఉన్నారు.

చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించాలి

కేపీహెచ్‌బీకాలనీ: చిన్నారులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు అన్నారు. 9వ ఫేజ్‌లోని జీహెచ్‌యంసీ షటిల్ కోర్టులో సోమవారం బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కేపీహెచ్‌బీ డివిజన్‌లో అనేక పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, ఇండోర్ షటిల్ కోర్టుల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ప్రజలందరు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి చెందిన ఎందరో క్రీడాకారులు సత్తా చాటుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వారికి గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 8 వేలు, 5 వేలు, 3 వేలు అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు వెంకటరాజు, సిహెచ్ వినోద్,జి. చందు, టి. స్వామి, మన్మోహన్, ప్రసాద్ గురుస్వామి, హనుమంత్‌రావు, శ్రీనివాస్‌రావు, దాశరథీ, రాంగోపాల్, ఆలపాటి సాయి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో ఓ వ్యక్తి కూర్చున్న చోటే మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆరా తీయగా సదరు వ్యక్తి గత నెల రోజులుగా రాంరెడ్డినగర్‌లో భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు 50నుండి 55 ఏళ్ల మధ్య ఉండవచ్చునన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనారోగ్యం, లేదా వడదెబ్బతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులు జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు



బీరప్పనగర్‌లో కరపత్రాలు పంచుతున్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలి రాజకీయాలు చేస్తున్నాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వినాయకనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పోచమ్మ గుడి వద్ద కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కొలన్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందన్నారు. నేడు నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500 లకే అందిస్తామని, విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు లక్షలాది ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, నాయకులు బేకు శ్రీనివాస్, నర్సింగ్, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, కిరణ్, మోహన్ రాజు , నర్సింహ, అంజాద్, గురుమూర్తి, శివ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ మార్చండి



జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సుధాకర్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ పరిధిలోని పలు గల్లీల్లో శిధిలావస్థకు చేరిన భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ల స్థానంలో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ రంగారెడ్డినగర్‌కు చెందిన ప్రకృతి విలువ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ సోమవారం వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడంతో తరచూ మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుండి పొంగి ప్రవహిస్తుందన్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అదే విధంగా పలు పాఠశాలల ఎదుట తరచూ డ్రైనేజీ పొంగడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. నూతన డ్రైనేజీ లైన్లను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరగా జీఎం శ్రీధర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

ఇఫ్తార్ విందులు ఐక్యతకు నిదర్శనం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మోతీనగర్: పవిత్ర రంజాన్‌మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ చౌరస్తాలో టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, నాయకులు సత్యం శ్రీరంగం, గోపిశెట్టి రాఘవేందర్, షఫియుద్దీన్, సుధాకర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ టి.రోజా

కుత్బుల్లాపూర్: మాణిక్యనగర్‌లోని శ్రీనిధి గ్లోబల్ ఒలంపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ టి.రోజా సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ పురస్కారాన్ని అందుకున్నారు. నగరంలోని రవీంద్రభారతిలో సుచిరిండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ, సినీ నటుడు అడవి శేషు ల చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధనా పద్ధతుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నందుకు గాను రోజాకు ఈ అవార్డు అందుకున్నారని, ఇది తమ పాఠశాలకు గర్వకారణమని పాఠశాల నిర్వాహకులు నల్లపాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ: గుట్టు చప్పుడు కాకుండా ఓ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో మూడు ముక్కలాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆదివారం రాత్రి దాడిచేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.48 వేల నగదు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ కాలనీ ఇండీస్ వన్ సిటీ ఫ్లాట్ నెంబర్ 808లో ఉంటున్న నేలకోటి దినేష్ కుమార్ ఆదివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం అందడంతో కేపీహెచ్‌బీ పోలీసులు దినేష్‌కుమార్ నివాసంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 సెల్ ఫోన్లు, 48 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో నైట్రో కార్ త్రీడీ ప్రింటింగ్ వర్క్‌షాప్



కేపీహెచ్‌బీకాలనీ: సాంకేతికోత్సవాల సన్నాహక కార్యక్రమంలో భాగంగా సోమవారం జేఎన్‌టీయూహెచ్ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నైట్రో కార్ బిల్ట్ మెకట్రానిక్స్ త్రీడీ ప్రింటింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. జేఎన్‌టీయూతో పాటు వివిధ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.వి.ఎస్. రాజు మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుని సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్స్ డా. బలరాం నాయక్, డా. పి. ప్రసన్న, శరత్ చంద్ర, నితిన్, అజయ్, ప్రణతి, శృజన, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేదు

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైందని బీజేపీ నేతలు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్, మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడద్యేనుగుల తిరుపతి, ఆరోపించారు. సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువును పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చెరువులు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాము విలేకరులతో మాట్లాడుతున్న సమయంలోనే చెరువును పూడ్చివేస్తుండటం దారుణమన్నారు. డివిజన్ పరిధిలో కాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ప్రజలకు ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉందన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు